పంట నష్ట పరిహారం.. రూ.58.32 కోట్లు

వ్యవసాయ పంటలకు రూ.44.62కోట్లు
ఉద్యాన రైతులకు రూ.13.70 కోట్ల సాయం
అన్నదాతల ఖాతాల్లో సొమ్ము జమ

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలో వరదలకు దెబ్బతిన్న ఉద్యాన, వ్యవసాయ పంటలకు కలిపి పంట నష్ట పరిహారం కింద మొత్తం రూ.58.32 కోట్ల పరిహారం మంజూరైంది. వరి, అపరాలు, ఇతర వ్యవసాయ పంటలు 44,652.50 ఎకరాల్లో దెబ్బతిన్నాయని సర్వేలో పంట నష్టాన్ని నమోదు చేశారు. 27,151 మంది రైతులకు రూ.44.62 కోట్ల పెట్టుబడి రాయితీని విడుదల చేయాలని ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ నివేదిక పంపించారు. కృష్ణా నది వరదకు 8,628 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. పంట నష్టపోయిన 6,435 మంది రైతులకు పరిహారం కింద రూ.13.70 కోట్లు విడుదల చేశారు. రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పంట నష్ట పరిహారాన్ని అమరావతిలో సీఎం చంద్రబాబు బుధవారం విడుదల చేశారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కావటం ప్రారంభమైంది.



వరదలకు లంక గ్రామంలో నీటమునిగిన అరటి తోట(పాతచిత్రం)

రైతుల హర్షం

పంట నష్టం సంభవించిన 25 రోజుల్లో తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పరిహారాన్ని 48 నుంచి 150 శాతం పెంచి తమ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయటంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు సత్వర సాయం అందించి ప్రభుత్వం ఆదుకుంది. వైకాపా ప్రభుత్వ పాలనలో గత డిసెంబరు 5న మిగ్‌జాం తుపానుకు జిల్లాలో 78 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా ఆరు నెలల వరకు తమకు పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని కర్షకులు గుర్తు చేసుకుంటున్నారు.

ఖజానా కార్యాలయం ప్రక్షాళన

చీరాల ఉద్యోగులు సుదూరాలకు బదిలీ

చర్యలకు ఉపక్రమించిన డైరెక్టర్

ఈనాడు కథనానికి స్పందన



ఈనాడు-బాపట్ల: జిల్లాలోని చీరాల ఉపఖజానా కార్యాలయంలో ఉద్యోగులు అందరిని బాపట్ల కలెక్టర్ నివేదికను అనుసరించి రాష్ట్ర ఖజానాశాఖ సంచాలకులు సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ మధ్య ఆ కార్యాలయ ఉద్యోగులు ఆఫీస్ ఆర్డర్‌ను ధిక్కరించి ఏకంగా ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల బిల్లులను పెండింగ్ పెట్టి ఇబ్బంది పెట్టారు. దీనిపై 'ఈనాడు'లో ఖజానా ఉద్యోగుల బరితెగింపు వ్యవహారాలపై వరుస కథనాలు ప్రచురితం కావటంతో కలెక్టర్ వెంకట మురళీ స్పందించి చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డితో విచారణ చేయించారు. ఆర్డీవో పరిశీలనలో ఉద్యోగులు వందల సంఖ్యలో బిల్లులు పెండింగ్ పెట్టినట్లు నివేదించారు. దీంతో కలెక్టర్ ఎస్టీవో భాగ్యలక్ష్మిని రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేయాలని మిగిలిన ఉద్యోగులు అందర్ని పలు సుదూర ప్రాంతాలకు బదిలీ చేయాలని డైరెక్టర్‌ను తన నివేదికలో కోరారు. స్పందించిన డైరెక్టర్ మోహనరావు చర్యలకు ఉపక్రమించారు. గతంలో అక్కడ ఉన్న ఉద్యోగులు మొత్తాన్ని ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఎస్టీవో భాగ్యలక్ష్మి, సీనియర్ అకౌంటెంట్(ఎస్‌ఏ) కోటి సుధీరను సస్పెండ్ చేయగా మిగిలిన ఆరుగురు ఉద్యోగులను బదిలీ చేశారు. వారి బదిలీలతో కార్యాలయం ప్రక్షాళన అయినట్లయింది.

ఎవరిని ఎక్కడకు బదిలీ చేశారంటే..

ఉద్యోగి పేరు	హోదా	బదిలీ ప్రదేశం
కె.సుజాత	సీనియర్ అకౌంటెంట్	గిద్దలూరు సబ్‌ట్రెజరీ కార్యాలయం
ఎన్.సౌభాగ్యవతి	ఎస్‌ఏ	నెల్లూరు డీటీ కార్యాలయం
కె.లక్ష్మీదేవి	ఎస్‌ఏ	నెల్లూరు డీటీ కార్యాలయం
టి.సుజాత	జూనియర్ అకౌంటెంట్	ఒంగోలు డీటీ కార్యాలయం
ఎస్. రాజేశ్వరి	జేఏ	సబ్ ట్రెజరీ, దర్శి
ఎస్.సోనియా	షరాఫ్	సబ్‌ట్రెజరీ, కనిగిరి

గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు

గుంటూరు, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు మీదుగా ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈ రైలు(02811) అక్టోబరు 5 నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి శనివారం భువనేశ్వర్‌లో 19.15 గంటలకు బయలుదేరి విజయవాడకు మరుసటిరోజు 07.25, గుంటూరు 08.35, నరసరావుపేట 09.20, యశ్వంతపూర్ సోమవారం 00.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(02812) అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ప్రతి సోమవారం యశ్వంతపూర్‌లో 04.30 గంటలకు బయలుదేరి నరసరావుపేట 18.29, గుంటూరు 19.20, విజయవాడ 21.30, భువనేశ్వర్ మంగళవారం 12.15 గంటలకు వెళ్తుందని పేర్కొన్నారు.



చెరుకుపల్లి: వర్షానికి నీట మునిగిన పైరు



వేమూరు: జంపని నుంచి పోతుమర్రు వెళ్లే రోడ్డు పక్కన పొలాల్లో వర్షపునీరు

రెండోసారీ ముంచింది!

దంచి కొట్టిన వర్షం
పైర్లు నీట మునిగి రైతుల నిట్టూర్పు

నగరం, ఆరుంబాక (చెరుకుపల్లి (గ్రామీణ), చెరుకుపల్లి, వేమూరు, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షం వరి రైతులను వణికిస్తోంది. నగరం మండలంలో ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు బుధవారం రెండు గంటల్లో 161 మి.మీ వర్షం కురిసింది. మంగళవారం 33 మి.మీ వర్షం కురిసింది. దీంతో మళ్లీ పంట చేలు నీటమునిగాయి. మండల కేంద్రం నగరం, అద్దంకివారిపాలెం, సిరిపూడి, పూడివాడ గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలు నీట మునిగాయి. ముంపు నుంచి ఇటీవల తేరుకున్న చేలల్లో రైతులు రెండో పర్యాయం నాట్లు వేశారు.. మరికొందరు వేస్తున్నారు. ఎకరానికి పది వేలు ఖర్చు చేసి నాటు వేసిన చేలు రాత్రికి రాత్రే ముంపునకు గురయ్యాయి. మళ్లీ మళ్లీ నాటే ఓపిక లేదని నగరం గ్రామానికి చెందిన సమ్మెట తిరుపతి వెంకయ్య, పులి రత్తయ్య, యరగళ్ల గోపి, వాకా గోపయ్య, గుమ్మడి కాంతారావు తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం చెరుకుపల్లి, ఆరుంబాక, కావూరు ప్రాంతాల్లోనూ వరి పైర్లు నీటమునిగాయి. ఆరుంబాక డ్రెయిన్‌లో అడ్డంకులతో వరద నీరు కిందకు పారుదల లేక నిలిచిపోయింది. దీంతో రైతులు జేసీబీ సాయంతో ఆరుంబాక ఎస్సీ కాలనీ సమీపంలో డ్రెయిన్‌లో పూడిక, అడ్డంకులను తొలగించారు. నెల రోజుల వ్యవధిలో ఇలా పైర్లు రెండుసార్లు ముంపునకు గురైతే ఇంకేమి వ్యవసాయం చేయగలం అని రైతులు నిట్టూర్పు విడుస్తున్నారు. వరద ముంపు తగ్గగానే సస్యరక్షణ చర్యలు చేపట్టి ఎరువు చల్లామని, పైరు ముంపు నుంచి కోలుకొంటున్న దశలో మళ్లీ భారీ వర్షం తమను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టిందని రైతులు వాపోతున్నారు. పిట్టలవానిపాలెం మండలంలో కోమలి, భవనంవారిపాలెం, చందోలు, జి.ఎన్.పాలెంలోని సుమారు 2 వేల ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. వేమూరు, చుండూరు మండలాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేలాది ఎకరాల వరిపైరు నీటమునిగిన సంగతి తెలిసిందే. నిజాంపట్నం మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



రేపల్లె పట్టణంలో ప్రకాశం ప్రభుత్వ పాఠశాల



రేపల్లె డ్రైనేజీ కార్యాలయ ప్రాంగణం



నగరం: సచివాలయంలో వర్షం నీరు



నగరం: రెండోసారి నాటేందుకు తీసుకొచ్చిన నారుతో రైతు రత్తయ్య

ఎవరి కోసం దుబారా?

ఈనాడు - అమరావతి

అంబులెన్స్ పేరుతో ఏఎన్‌యూలో నిధుల వ్యయం

అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ అవసరమే. కానీ.. ఈ పేరుతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిధులు దారి మళ్లుతున్నాయి. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులకు ప్రాథమిక వైద్యం అందించడానికి క్యాంపస్‌లోనే ఒక ఆరోగ్య ఉప కేంద్రం నడుస్తోంది. ఇది పీహెచ్‌సీ కాదు. ఇందులో ఇద్దరు వైద్యులు, పదిమందికిపైగా పారామెడికల్ ఉద్యోగులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వర్సిటీ కీలక అధికారి ఒకరు అవసరం లేకపోయినా తన బంధువులకు చెందిన వాహనాన్ని రెండో అంబులెన్స్‌గా తీసుకొచ్చారు. ఇలా మూడేళ్ల నుంచి నెలవారీ అద్దె చెల్లిస్తున్నారు. అంబులెన్స్‌ల కోసమని పగలు, రాత్రి వేళల్లో ముగ్గురు, నలుగురు డ్రైవర్లను నియమించి వారికి జీతభత్యాలు చెల్లిస్తున్నారు.



హెల్త్ సెంటర్‌లో వినియోగించే అంబులెన్స్

ఉద్యోగుల రాకపోకల కోసమా...

☛ విద్యార్థులకు అత్యవసర వైద్య పరిస్థితులు ఏర్పడితే వెంటనే అంబులెన్స్ పంపాలి. అందుకు భిన్నంగా ఇక్కడున్న రెండు అంబులెన్స్‌లు చాలావరకు ఉద్యోగులను ఇళ్ల నుంచి ఆసుపత్రికి, ఆసుపత్రి నుంచి ఇళ్లకు తీసుకెళ్లడానికి ఉపయోగిస్తున్నారు. ఓ వైద్యుడైతే నిత్యం తన రాకపోకలన్నింటికీ ఒక అంబులెన్స్‌ను వాడుతున్నారు. వీటికి పెద్దమొత్తంలో నెలవారీ ఇంధన ఖర్చులు రాస్తున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ. 40 వేలకుపైగానే అద్దె చెల్లిస్తున్నారు. డ్రైవర్లకు నెలకు రూ. 50 వేలకుపైగా చెల్లిస్తున్నట్టు తెలిసింది. అక్కడ రోజువారీ ఓపీ ఎంత? అవుతున్న వ్యయం ఎంతో ఓసారి బేరీజు వేసుకుంటే ఎంతమేర దుబారా అవుతోందో తెలుస్తుంది.

☛ వర్సిటీకి సమీపంలోనే ఉన్న ఎన్నారై ఆసుపత్రితో ఎంఓయూ ఉంది. మరోవైపు 20 కిలోమీటర్ల దూరంలో గుంటూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ఉంది.

☛ వర్సిటీలో విద్యార్థులు, ఉద్యోగులు కలిపి దాదాపుగా 4 వేల మంది వరకు ఉంటారు. ఆరోగ్య ఉప కేంద్ర అధికారులు మాత్రం 8 వేలమంది వరకు ఉన్నారని లెక్క చెబుతున్నారు. నిత్యం ఓపీకి 70 మంది వస్తున్నారని కాకి లెక్కలేస్తున్నారు. ఈ కేంద్రంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదని వర్సిటీ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

☛ ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలాన్ని వివరణ కోరగా ఆరోగ్య కేంద్రం పనితీరు.. అంబులెన్స్‌లు. వాటికవుతున్న వ్యయాలపై ఇటీవల ఆరా తీశామని చెప్పారు. ఖర్చు కొంచెం ఎక్కువగానే ఉందన్నారు. అంబులెన్స్‌కు చెల్లించే అద్దెతో ఇప్పటికే కొత్తది కొనుగోలు చేయొచ్చన్నారు. కానీ గత అధికారులు ఆ పని చేయలేదని, దీనిపై ఇంజినీరింగ్ విభాగాన్ని నివేదిక కోరామని తెలిపారు. అవసరమైతే ఒక అంబులెన్స్‌తోనే సేవలందించేలా చర్యలు తీసుకుని నిధుల దుబారాకు కళ్లెం వేస్తామన్నారు.

డీపీఈవోగా దేవదత్తు నియామకం



బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా గంటా దేవదత్తు నియమితులయ్యారు. ఏలూరు నుంచి ఆయన బదిలీపై బాపట్ల వచ్చారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పని చేసిన అరుణ కుమారి గుంటూరు బదిలీ అయ్యారు.

డీటీవో నేడు బాధ్యతల స్వీకరణ

జిల్లా రవాణాశాఖాధికారిగా పరంధామరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. పల్నాడు డీటీవోగా పని చేస్తూ బదిలీపై ఆయన బాపట్ల వస్తున్నారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఆర్.సురేష్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు.

కూలీ రెట్లు పెంచాలని హమాలీల నిరసన

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఎఫ్‌సీఐ గోదాముల్లో పనిచేసే హమాలీలకు కూలి రేట్లు పెంచాలని మూడు రోజులపాటు ధర్నా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల హమాలీల సంఘం జిలా కార్యదర్శి బి.పైడయ్య పేర్కొన్నారు. బుధవారం మొదటి రోజు సందర్భంగా దేశాయిపేటలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పైడయ్య మాట్లాడుతూ..జిల్లాలోని దేశాయిపేట, రేపల్లె, బాపట్లలోని ఎఫ్‌సీఐ గోదాముల్లో పనిచేసే హమాలీలు 112 మంది వరకు ఉన్నారన్నారు. వీరికి ప్రస్తుతం లారీల్లోకి లోడ్ చేయడానికి ఒక్కొక్క బస్తాకు రూ.6.25 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. అదనంగా మరో రూ.5 పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన జీవో ఈ ఏడాది జనవరిలో విడుదల కావాల్సి ఉండగా నేటికి విడుదల చేయలేదన్నారు. ప్రతినెల తాగునీటి కోసం రూ.600లు ఇవ్వాల్సి ఉండగా వాటిని సక్రమంగా అందజేయడం లేదని, పీఎఫ్ స్లిప్పులు ఇవ్వడం లేదని వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రెండో రోజు తహసీల్దారు కార్యాలంయంలో వినతి పత్రాలు, మూడోరోజు ఒకపూట పూర్తిగా లోడింగ్ నిలిపివేస్తామని ఆయన తెలిపారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

ఆర్ సెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ఆర్ సెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్‌సీసీ, విభిన్న ప్రతిభావంతులు, క్రీడా కోటాలో సీట్లు దక్కించుకున్న అభ్యర్థుల విద్యార్హత పత్రాలు పరిశీలించామని కన్వీనర్ డాక్టర్ బ్రహ్మాజీరావు చెప్పారు. ఏపీ ఆర్ సెట్ ప్రవేశాల కన్వీనర్ వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 105 మంది అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. క్రీడల కోటాలో సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు అభ్యర్థులు తెలిపారు. సర్టిఫికెట్లకు కాలపరిమితి ఉందని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు అన్ని సర్టిఫికెట్లు తనిఖీ చేసి, ఆ వివరాలు ప్రభుత్వానికి పంపిస్తామని. .అక్కడ తీసుకునే నిర్ణయం ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పడంతో అభ్యర్థులు శాంతించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించం



సీఐ వీరాంజనేయులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో హేలా షారోన్

కొల్లూరు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, అక్రమ రవాణాదారుల్ని అరెస్టు చేయడానికి సైతం వెనుకాడబోమని ఆర్డీవో హేలాషారోన్ హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపు విషయంలో అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో ఆమె బుధవారం మండల పరిధిలోని కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు కృష్ణానది ఒడ్డున నిర్దేశిత ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయమని ఉన్నతాధికారులు చెప్పిన విషయం ఆచరణలో ఏమైందని తహసీల్దార్ వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. ఆయన నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. ఈ విషయమై సీఐ వీరాంజనేయులు మాట్లాడుతూ కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అక్కడ అవసమైన మేరకు సిబ్బందిని నియమించామని తెలిపారు. ఈ చెక్‌పోస్టుల సంఖ్యను పదికి పెంచనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్డీవో వెంట కొల్లూరు, భట్టిప్రోలు ఎస్సైలు ఏడుకొండలు, శివయ్య, డీటీ నిరంజన్ ఉన్నారు.

12 ట్రాక్టర్ల స్వాధీనం, కేసులు నమోదు

కొల్లూరు మండల పరిధిలో పెసర్లంక, గాజుల్లంక సమీపంలో కృష్ణాది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 12 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు బుధవారం తెలిపారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక లారీ, నాలుగు ట్రాక్టర్లను భట్టిప్రోలు మండల పరిధిలో వివిధ చోట్ల రహదారులపై స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివయ్య తెలిపారు.

పర్చూరు సీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు


పర్చూరు సీహెచ్‌సీ హెల్త్ సెంటర్


పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే : నియోజకవర్గ కేంద్రం పర్చూరులోని కమ్యూనిటీ హెల్త్ కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు వైద్యాధికారి సిద్ధార్థ వెల్లడించారు. ఈనెల 9, 10న నిర్వహించిన సర్వేలో వైద్యశాలకు 83.47 శాతం పాయింట్లు స్కోరు సాధించడంతో జాతీయస్థాయిలో గౌరవం దక్కిందని ఆయన తెలిపారు. అత్యవసర, ఓపీ, ఔట్‌పేషెంట్లు, ఇన్‌పేషంట్లు, ల్యాబ్, పార్మసీ, పరిశుభ్రత, పచ్చదనం, శస్త్రచికిత్స సేవలు, ప్రమాద కేసులు తదితర అంశాల్లో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ.. జాతీయ స్థాయి గుర్తింపు లభించడం అరుదైన ఘనత అన్నారు. గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందిని అభినందించారు.

జాతీయ పోటీల్లో బాపట్ల క్రీడాకారుల ప్రతిభ


పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి అండర్-14, అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాపట్ల క్రీడాకారులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. అండర్-19 విభాగంలో అద్దంకి భువనేశ్వర్, కారుమంచి అభిరామ్, ఉప్పాల దత్తాత్రేయ వెంకట్, పి.శ్రీకృష్ణ, అండర్-16 విభాగంలో ఉప్పాల ధర్మ, కర్రి కేశవ, ఆకుల వైభవ్, దేవరకొండ దిలీప్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచారు. క్రీడాకారులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అభినందించారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాధన చేయటానికి మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, యువ నేత తాతా హరిశ్చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


సీఎం చంద్రబాబుకు విరాళం అందిస్తున్న ప్రతినిధులు

రేపల్లె అర్బన్: వరద బాధితులకు ఆదుకునేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తున్నారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,50,116ను ఈనెల 24న అందించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు, కార్యదర్శి ఏజీకే మూర్తి, వెంకటేశ్వరరావు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50,555ను నగరం ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు రేపల్లెలో తెదేపా నేత శివప్రసాద్‌కు బుధవారం అందించారు.

రాష్ట్ర స్థాయి అండర్-14 సబ్ జూనియర్స్ ఖోఖో జట్టు ఎంపిక


క్రీడా దుస్తులు అందిస్తున్న దాతలు

జే.పంగులూరు, న్యూస్‌టుడే : ఝార్ఖండ్ రాష్ట్రం షిండీగా పట్టణంలో ఈనెల 28 నుంచి అక్టోబరు మూడో తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల జట్టును బాపట్ల జిల్లా జే.పంగులూరు ఎంఎస్ఆర్. అండ్ బీఎస్ఎం. జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద ఎంపిక చేశారు. బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో అండర్-14 సబ్ జూనియర్స్ ఖోఖో క్రీడాకారుల జట్టు వివరాలను ఎస్ఈఆర్ఆర్ అకాడమీ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి వివరించారు. డి.బాజీవలి, వి.సాగర్, పి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్, వి.నారాయణరెడ్డి, కె.వెంకటసాయి, (ప్రకాశం), పి.జ్యోతిరాము(అనంతపురం), ఎన్.భవానీశంకర్(కృష్ణ), డి.రవి(శ్రీకాకుళం), ఎస్.వీరేంద్ర(తూ.గో), బి.రామ నాపాల్(గుంటూరు), ఆర్.బాలీశ్(కర్నూలు), స్వతీసాయి(విశాఖ), ఎస్.జబి రీనాథ్(చిత్తూరు), ఎన్.గౌతమ్(నెల్లూరు) ఎంపికయ్యారు. వీరికి రూ.25 వేల విలువ చేసే క్రీడా సామగ్రి అందజేశారు.

అనారోగ్యంతో పోలీసు జాగిలం మృతి

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


సెల్యూట్ చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వహిస్తున్న జాగిలం పాక్సీ అనారోగ్యంతో మృతి చెందింది. వెదుళ్లపల్లిలోని కెన్నెల్ భవనం వద్ద జాగిలం కళేబరానికి ఎస్పీ తుషార్ డూడీ, అదనపు ఎస్పీ విఠలేశ్వర్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలాలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పూలు వేసి నివాళి అర్పించారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జాగిలం రెండేళ్లు పోలీసు శాఖలో సేవలందించిందన్నారు. 2021లో మంగళగిరిలో నిర్వహించిన శిక్షణలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. చోరీ, హత్య, అత్యాచారం వంటి నేరాల ఛేదనలో కీలకంగా వ్యవహరించిందన్నారు. జాగిలం అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమన్నారు.

స్పీడ్ పెట్రోల్ బదులు నీళ్లు!

రేపల్లెలో ఓ పెట్రోల్ బంకులో ఘటన


సీసాలో పైన పెట్రోల్, అడుగున నీరు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లెలో ఓ పెట్రోలు బంకులో ఇంధనానికి బదులు నీరు రావడం కలకలం రేపింది. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం తమ ద్విచక్ర వాహనాల్లో ఒక్కొక్కరు రూ.200 చొప్పున స్పీడ్ పెట్రోలు కొట్టించారు. కొంత దూరం వెళ్లిన తరువాత వేర్వేరు చోట్ల వాహనాలు ఆగిపోయాయి. దీంతో మెకానిక్ వద్దకు వెళ్లి చూపించగా ట్యాంకు నుంచి నీళ్లు రావడం గమనించి సీసాలో నింపారు. తక్షణం సమస్యను పెట్రోలు బంక్ యజమాని దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా పరిశీలించారు. బుధవారం సాయంత్రం కంపెనీ ట్యాంకరు వచ్చి డీజిల్, పెట్రోలు, స్పీడ్ పెట్రోలు నింపి వెళ్లిందని తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని స్పీడ్ పెట్రోలు సరఫరా చేసిన కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం తెలిసిన రెవెన్యూ ఆర్ఐ రాంబాబు, వీఆర్వో వెంకటేశ్వరమ్మ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయమై బంక్ యజమానులు గోపాలరావు, బుజ్జిబాబు మాట్లాడుతూ స్పీడ్ పెట్రోలులో నీరు రావడంతో వాహనాల్లో నింపడం ఆపేశామన్నారు. కంపెనీ ప్రతినిధులు గురువారం వచ్చి సమస్యకు కారణం వెల్లడిస్తారని తెలిపారు.


నగరం: చెరువుల్లా చేలు


చెరుకుపల్లి: నీట మునిగిన వరిపైర్లు

జిల్లాలో కుంభవృష్టి

అత్యధికంగా నగరంలో 161.4 మి.మీ. వర్షపాతం

నీట మునిగిన పంట చేలు


పి.వి.పాలెం: బీవీపాలెంలో చేలల్లో నీరు


చెరుకుపల్లి: ఆరుంబాక ఎస్సీ కాలనీ వద్ద మురుగు కాల్వలో పూడిక తీస్తున్న జేసీబీ

బాపట్ల, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని తీర ప్రాంతంలో బుధవారం కుంభవృష్టి కురిసింది. నగరం మండలంలో అత్యధికంగా 161.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. చెరుకుపల్లి 110.2 మి.మీ., కర్లపాలెం 85.6 మి.మీ., పిట్టలవానిపాలెం 82.4 మి.మీ., నిజాంపట్నం 84.4 మి.మీ., రేపల్లె 70.4 మి.మీ., అమృతలూరు 53.3 మి.మీ., యద్దనపూడి 58.4 మి.మీ., పర్చూరు 57.2 మి.మీ., సంతమాగులూరు 47.4 మి.మీ., బాపట్ల 38.8 మి.మీ., జే.పంగులూరు 25 మి.మీ., కొల్లూరు 23.4 మి.మీ., చుండూరు 19.2 మి.మీ., వేమూరు 16.4 మి.మీ, మార్టూరు 12.4 మి.మీ., భట్టిప్రోలు 9.6 మి.మీ., కారంచేడు 8.2 మి.మీ., వేటపాలెం 8.2 మి.మీ., కొరిశపాడు 7.2 మి.మీ., చీరాల 6.4 మి.మీ., బల్లికురవ 5.2 మి.మీ., చినగంజాంలో 5 మి.మీ. చొప్పున వర్షం కురిసింది. జిల్లాలో 1020.8 మి.మీ. వర్షం కురవగా, సగటున 40.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి నగరం, భట్టిప్రోలు, రేపల్లె, పీవీపాలెం, కర్లపాలెం, చెరుకుపల్లి మండలాల్లో వేల ఎకరాల్లో పంటలు మళ్లీ నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో మోకాలి లోతున నీరు చేరింది. మండల కేంద్రం నగరం సచివాలయంలో నీరు చేరింది. చివరి ఆయకట్టుకు సాగునీరందక ఇబ్బంది పడుతున్న రైతులు వర్షంతో ఉపశమనం పొందారు. కాలువల ద్వారా నీరు చివరి ఆయకట్టుకు చేరింది. బాపట్ల, చీరాల, పర్చూరు, కారంచేడు, వేటపాలెం, చినగంజాం మండలాల్లో వేగంగా నాట్లు వేస్తున్నారు. మెట్ట పంటలకు ఈ వర్షం మేలు చేసింది.

తేరుకోనీయని వరుణుడు

ప్రకృతి విపత్తులతో తీరం రైతు విలవిల


ముత్తుపల్లి పంట కాలువ కింద భూములు నేడు ఇలా..


నిన్న ఇలా..

నగరం, న్యూస్‌టుడే: వారం, పది రోజులు తిరగకుండానే మళ్లీ వానలు వెంటాడటంతో తీరం రైతులు విలవిలలాడుతున్నారు. మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షాలకు తీర గ్రామాల్లో వందల ఎకరాలు నీటమునిగాయి. సెప్టెంబరు ఆరంభంలో కురిసిన భారీ వర్షాల నుంచి తేరుకోకముందే మళ్లీ మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముత్తుపల్లి పంట కాలువ కింద పొలాలు దాదాపు 20 రోజులు వరద నీటిలో నానాయి. వేసిన నాట్లు, పెట్టిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరైంది. చేలను ఆరా బెట్టే వీలులేక అప్పులు చేసి మళ్లీ నాట్లు వేసేందుకు రైతులు నారు, భూములను సిద్ధం చేసుకున్నారు. కొందరు నాటుకూడా వేశారు. మరికొందరు నేడో, రేపో నాటేందుకు నారు సిద్ధం చేసుకుంటున్నారు. ఇంతలోనే మళ్లీ ముంచెత్తింది.

లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరిక


నగరం: సమావేశం కోసం రోడ్డుపై వేసిన టెంట్

నగరం: మండల కేంద్రం నగరంలో కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు, పాఠశాలలు, పూరిళ్లు జలమయమయ్యాయి. నగరంలోని ప్రాథమిక పాఠశాల, స్థానిక సచివాలయం కార్యాలయంలోకి వర్షం నీరు చేరింది. సచివాలయంలో సామగ్రికి కొంతమేర నష్టం కలిగిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎదురుగా ఉన్న బాపట్ల రహదారిలో టెంట్ వేసి నిర్వహించారు. ధూళిపూడి ఎస్సీ కాలనీ, నగరం సినిమా హాలు రోడ్డు వెనుక కొత్త కాలనీ, పూడివాడ, సిరిపూడి, పెదపల్లి తదితర గ్రామాల్లోని కొన్ని కాలనీల్లోకి వర్షం నీరు చేరింది.

డ్రెయిన్లతోనే ముంపు


ఉద్ధృతంగా ప్రవహిస్తున్న యాజలి డ్రెయిన్

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పొలాల్లో పంట సాగు చేయటానికి సాగు నీటి కాల్వలు ఎంత అవసరమో మురుగునీరు పోవటానికి మురుగు కాల్వలు అంతే ప్రాధాన్యం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో మురుగు పోయే డ్రెయిన్లు పూడికతో ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అమృతలూరు, పొన్నూరు, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలంలోని పొలాల్లో మురుగు పోయే తెనాలి, యాజలి డ్రెయిన్లకు 20 ఏళ్ల నుంచి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే పొలాల్లోని పైరు నీటి మునుగుతోంది. తూటుకాడ, గుర్రపుడెక్క, ముళ్ల పొదలతో డ్రెయిన్లు నిండి పారుదల లేక పొలాల్లో నీరు వారం రోజుల పాటు అలాగే ఉంటున్నాయి. దీంతో పంట పూర్తిగా దెబ్బతింటుదని రైతులు తెలిపారు.

వైకాపా జడ్పీటీసీ సభ్యురాలి భర్త అక్రమాలపై ఫిర్యాదు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల వైకాపా జడ్పీటీసీ సభ్యురాలు ఎస్తేరురాణి భర్త పిన్నిబోయిన సుందర్‌సింగ్ ఇళ్లస్థలాల ప్లాట్లు విక్రయిస్తానని వందల మంది నుంచి రూ.కోట్లు వసూలు చేసి ఇవ్వకుండా మోసం చేశాడని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెదేపా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి సుందర్‌సింగ్ చేతిలో మోసపోయిన బాధితులు ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ముత్తాయపాలెంలో వైకాపా నేత 3 సెంట్లు చొప్పున ప్లాట్లు వేసి విక్రయించి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నాడన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నా స్థలాలు మాత్రం చూపలేదన్నారు. అతని అక్రమాలు, మోసాలపై బాధితులతో ఫిర్యాదు చేయించి పోలీసు, రెవెన్యూ అధికారులతో విచారణ చేయిస్తామన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విభాగం ఏడీపై విచారణకు వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: కేంద్ర జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా అర్హులైన దివ్యాంగులకు స్వయం ఉపాధి నిమిత్తం రాయితీ రుణాల మంజూరులో దివ్యాంగుల విభాగం ఏడీ అర్చన అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ జేసీ ప్రఖర్‌జైన్‌కు నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్లో జేసీని కలిసి ఆయన మాట్లాడుతూ ఓ వ్యక్తి నకిలీ దివ్యాంగ ధ్రువపత్రంతో రుణం కోసం దరఖాస్తు చేయగా జిల్లా కమిటీ తిరస్కరించిందన్నారు. అదే వ్యక్తి మరో పత్రంతో వస్తే దానిని ఏడీ ఆమోదించి జిల్లా కమిటీకి తెలియకుండా రుణం మంజూరు చేయించారని ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. అతని నుంచి రుణం సొమ్ము రూ.5 లక్షలు రికవరీ చేయాలన్నారు.

భావనారాయణస్వామి ఆలయ ఈవోగా రవికుమార్



బాపట్ల, న్యూస్‌టుడే: భావనారాయణ స్వామి సమూహ ఆలయాల ఈవోగా ఎన్వీ రవికుమార్ నియమితులయ్యారు. తిమ్మసముద్రం నుంచి బదిలీపై ఆయన బాపట్ల వచ్చారు. ఆలయంలోని దేవాదాయశాఖ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా దేవాదాయశాఖాధికారి పానకాల రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు ఈవోగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు ప్రత్తిపాడు మండలం యనమదల సమూహ ఆలయాల ఈవోగా బదిలీ అయ్యారు.

ఎన్టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సుబ్బారావు



కర్లపాలెం, న్యూస్‌టుడే: ఎస్టీయూ ఉద్యమ, శిక్షణ తరగతుల రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉపాధ్యాయుడు నర్రా సుబ్బారావు నియమితులయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బొంత వెంకటేశ్వర్లు, పందరబోయిన వెంకట్రావు, పీవీ నాగరాజు, బడుగు శ్రీనివాసరావు, అమర్నాథ్, నాగరాజు, బుర్ల సుబ్బారావు ఆయనకు అభినందనలు తెలిపారు.

దోనేపూడి దారిలో కారు బీభత్సం

సరకు రవాణా వాహనం, విద్యుత్తు స్తంభానికి ఢీ


ప్రమాద దృశ్యం

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దోనేపూడిలో ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఓ కారు బీభత్సం సృష్టించింది. రేపల్లె నుంచి కొల్లూరు వైపునకు వస్తున్న కారు దోనేపూడి వద్ద ఓ సరకు రవాణా వాహనాన్ని ఢీకొని అంతటితో ఆగక విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో సరుకు రవాణా వాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయట పడినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు రేపల్లెకు చెందినదిగా తెలుస్తోంది. సరకు రవాణా వాహనానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో మలుపు ఉండడం, కారు వేగంగా ప్రయాణిస్తుండడం, ఆ సమయంలో వర్షం కురుస్తుండడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

ట్రాక్టర్‌లో బ్యాటరీ చోరీ

నగరం, న్యూస్‌టుడే: నగరంలో మంగళవారం జరిగే సంతలో ఎక్కడోచోట దొంగతనం జరుగుతూనే ఉంది. మంత్రిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి కూరలు కొనేందుకు రోడ్డుపై ఉంచిన బైక్ మాయమైంది. కూరలు కొని తిరిగొచ్చే లోపు బైక్ కనిపించకుండా పోయింది. నగరం గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వరరావు పొలంలో దుక్కి దున్ని భోజనం చేసేందుకు ఇంటికెళ్లి వచ్చేలోపు దానిలో బ్యాటరీ చోరీ అయింది. ఇదే ప్రాంతంలో ఇటీవల పొలంలో ఏర్పాటు చేసిన మోటార్ చోరీకి గురైంది. ప్రకృతి విపత్తులతో సతమతమవుతున్న రైతులకు దొంగల భయం తోడైంది. అధికారులు స్పందించి దొంగతనాలు జరగకుండా చూడాలని నగరం ప్రజలు కోరుతున్నారు.

కాల్వలో పడి రైతు మృతి

భట్టిప్రోలు: పొలంలో నీరు బయటకు పంపేందుకు వెళ్లిన రైతు కాల్వలో పడి మృతిచెందిన ఉదంతం మండలంలోని తాతావారిపాలెంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురుస్తుండటంతో గ్రామానికి చెందిన పడమట రామారావు (70) పొలంలో నీటిని బయటకు పంపేందుకు వెళ్లాడు. వర్షం కురుస్తుండటంతో ప్రమాదవశాత్తు వేమవరం ఛానల్‌లో పడి మృతిచెందాడు. పొలం వెళ్లిన రామారావు మధ్యాహ్నం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి వెతికారు. పొలంలో కనిపించలేదు. కాల్వ పొడవునా వెతకగా పెద్దవరం దగ్గర్లో కాల్వలో మృతదేహం కనిపించింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.


కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

సోషల్ సిలబస్ తగ్గించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: పదో తరగతి సోషల్ పాఠ్యాంశంలో సిలబస్ తగ్గించాలని కోరుతూ ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో మంగళగిరిలో విద్యాశాఖ కమిషన్ కార్యాలయంలో సంయుక్త సంచాలకుడు ఎం.వెంకటకృష్ణారెడ్డిని కలిసి ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 9, 10 తరగతులకు సాంఘిక శాస్త్రం బోధించటానికి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. నవంబరు 26ను సాంఘికశాస్త్ర దినోత్సవంగా ప్రకటించాలని, తెలుగు మీడియంను కొనసాగించాలని కోరారు. జీవో నంబరు 117తో ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో కలపటం వల్ల 3 నుంచి 10వ తరగతి వరకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బోధిస్తున్నారని, ఆ జీవోను రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్.కె. సైరున్నీసాబేగం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.శేషుబాబు ఉన్నారు.

బాపట్ల
• బాపట్ల • రేపల్లె • వేమూరు

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావ ర్యాలీ

రేపల్లె అర్బన్: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ కావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా రేపల్లె పెదకూరగాయల మార్కెట్ వినాయకుని గుడి నుంచి ఉప్పూడి రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు గురువారం సాయంత్రం 4 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడి గోడపత్రిక బుధవారం ఆవిష్కరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భట్టిప్రోలు: వెల్లటూరు పంచాయతీ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ ఏడుకొండలు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంగీత జగత్తులో ఎస్పీ బాలు ధ్రువతార

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ చలనచిత్ర సంగీత జగత్తులో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ధ్రువతార అని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ కొనియాడారు. స్థానిక జమీదారుపేటలోని సాహితీ భారతి కార్యాలయంలో ఎస్పీ బాలు వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాదాపు 40వేలకు పైగా పాటలు పాడిన ఆయన 11 భాషల్లో తన గాత్ర మాధుర్యాన్ని పంచారని తెలిపారు. అద్భుత గీతాలు ఆలపించి సంగీత ప్రియులను అలరించారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆడం షఫీ, డాక్టర్ శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? పట్టణంలోని మూడో వార్డులో పందులు ఎక్కువగా తిరుగుతున్నాయి. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.
- రమేష్, స్థానికుడు

✔ వార్డులో పందులు తిరగకుండా చర్యలు తీసుకుంటాం. పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేసి పట్టణానికి దూరంగా పంపిస్తాం. **- ఉమామహేశ్వరరావు, పురపాలక ఏఈ** – న్యూస్‌టుడే, బాపట్ల

సాంకేతిక సమస్య సరిదిద్దారు

కర్లపాలెం, న్యూస్‌టుడే: మండలంలో గాంధీనగర్‌లో వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోంది. దీనిపై స్థానికుల సమాచారం మేరకు ఈ నెల 20న 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షికన 'ఈనాడు' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి షణ్ముఖరావు స్పందించి విద్యుత్తు లైన్‌లో సాంకేతిక సమస్యను పరిష్కరించారు. రాత్రి సమయంలో మాత్రమే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

కాల్వలు తీసి.. నీటిని పంపి..

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనివల్ల స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు' ఈనెల 21న అధికారుల దృష్టికి తెచ్చింది. గ్రామ కార్యదర్శి శివకుమార్ స్పందించారు. సిబ్బందిని బుధవారం పంపి రహదారికి ఇరువైపులా కాల్వలు తీయించి నీరుపోయేలా చేశారు. సమస్య పరిష్కారం కావటంతో వాహనచోదకులు, పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మునకేసిన సరస్వతీ నిలయాలు

భారీ వర్షంతో చెరువులను తలపిస్తున్న ప్రాంగణాలు


రేపల్లె: కోర్టు ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు


భట్టిప్రోలు: దళితవాడలో రహదారిపై మురుగు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి రేపల్లె పట్టణంలో పలు విద్యాలయాల లోతట్టు ప్రాంగణాలు జలాశయాలుగా మారాయి. ప్రకాశం, శివాజీ ప్రాథమిక పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి తిష్టవేస్తోంది. రాకపోకలు సాగించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బడులకు వెళ్లి తిరిగి వచ్చేప్పుడు తమ పిల్లలు ఎక్కడ జారి పడతారోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాన కురిసిన ప్రతిసారీ తమకు అవస్థలు తప్పడం లేదని గురువులు, చిన్నారులు వాపోతున్నారు. లోతట్టు ప్రాంతాలను మెరక చేయించి తాము పడుతున్న ఇక్కట్లకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ సాంబశివరావు, ఎంఈవో సురేష్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు.

★ రేపల్లె న్యాయస్థానం, డ్రెయినేజీ, మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణాలు జలాశయాలను తలపించాయి. రాకపోకలు సాగించేందుకు ఉద్యోగులు అవస్థలు పడ్డారు. పట్టణంలో మురుగు కాల్వలు పొంగి వర్షం నీటితో కలిసి రహదారులపై చేరి తటాకాల్లా మారాయి. రోడ్లపై చేరిన మురుగులో నడిచేందుకు బాటసారులు అసౌకర్యానికి గురయ్యారు. నగరంలో అత్యధికంగా 161 మి.మీ., రేపల్లెలో అత్యల్పంగా 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

★ భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో పక్కా మురుగు కాల్వలున్నా ఉపయోగపడటం లేదు. భారీ వర్షం కురిస్తే మురుగు సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపం, భట్టిప్రోలు దళితవాడ, ఆయుర్వేద వైద్యశాల, మార్కెట్ వెనుక, భోగేశ్వరంపేట ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంటోంది. అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ మురుగు కాల్వలు పరిశీలించి పూడిక తీయిస్తామని తెలిపారు.

★ నిజాంపట్నం మండలంలో వానలకు పల్లపు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. పలు పాఠశాలల ప్రాంగణాలు నీటితో నిండాయి.


నిజాంపట్నం: జలమయమైన జడ్పీ పాఠశాల ప్రాంగణం


రేపల్లె: ప్రకాశం పాఠశాలకు కుమారుడిని తీసుకెళ్తున్న తల్లి


భట్టిప్రోలు: ప్రధాన రహదారిపై నీరు


రేపల్లె: జలాశయాన్ని తలపిస్తున్న జూనియర్ కళాశాల ఆవరణ


రేపల్లె: శివాజీ మున్సిపల్ బడి ప్రాంగణం దుస్థితి


భట్టిప్రోలు: ఆయుర్వేద వైద్యశాల వెనుక ఇళ్లను చుట్టుముట్టిన నీరు

– న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్, భట్టిప్రోలు, నిజాంపట్నం

గ్రహణం మొర్రి వైద్య పరీక్షలు

బాపట్ల, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధన సంస్థ ఉచిత గ్రహణం మొర్రి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించింది. డీఈవో నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ లక్ష్మీకుమారి శిబిరాన్ని ప్రారంభించారు. గ్రహణం మొర్రితో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులకు టాబ్లెట్లు అందజేశారు. బాధితులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు లక్ష్మీకుమారి తెలిపారు. ఐఈసీ జ్యోత్స్న, డీఐఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తోకలవానిపాలెం శివారు కృష్ణనగర్‌లో 50 వరద బాధిత కుటుంబాలకు సహృదయ ఫౌండేషన్ వారు నిత్యావసరాలు బుధవారం పంపిణీ చేశారు. సర్పంచి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. ప్రగతికి సూచిక

బాపట్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛత సమగ్ర ప్రగతికి సూచిక అని ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఏడీ డీ స్మిత్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల విద్యార్థులు క్రీడా మైదానంలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. కళాశాల ఏడీ ఎంఎస్ బేగ్, ఎన్ఎస్ఎస్ అధికారులు లావణ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ పురపాలక అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది కొవ్వొత్తులతో పాత బస్టాండ్ వద్ద బుధవారం రాత్రి ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛత ఆవశ్యకతను పురపాలక ఏఈ ఉమామహేశ్వరరావు వివరించారు.


పారిశుద్ధ్య సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు

చుండూరు,న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ప్రాంతీయ వ్యాయామ విద్యాధికారి బాషా అన్నారు. చుండూరు మండలం యడ్లపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ బాలబాలికలు ఆటలాడడం వల్ల శరీర దారుఢ్యంతో పాటు, తెలివితేటలు పెరుగుతాయన్నారు. దాని వల్ల బాగా చదువుకోవచ్చన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ స్థానం దక్కించుకున్న యడ్లపల్లి పాఠశాల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ విద్య కార్యదర్శి కరీముల్లా, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేత యడ్లపల్లి : అథ్లెటిక్స్ పోటీలకు నియోజకవర్గంలో వివిధ పాఠశాలలకు చెందిన 100మంది విద్యార్థులు పాల్గొనగా ఒక్క యడ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 15మంది బాలబాలికలు జిల్లా పోటీలకు ఎంపికై, నియోజకవర్గ స్థాయి ఛాంపియన్ స్థానం దక్కించుకున్నట్లు పీఈటీ తెలిపారు. షటిల్‌లో అండర్-17, 14 బాలుర విభాగంలో భట్టిప్రోలు మండలం ఐలవరం, యడ్లపల్లి విద్యార్థులు, బాలికల విభాగంలో కొల్లూరు మండలం అనంతవరం, అమృతలూరు మండలం పెదపూడి పాఠశాలల విద్యార్థులు విజయం సాధించినట్లు చెప్పారు.


విజయం సాధించిన యడ్లపల్లి బాలబాలికలతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీఈటీ శరత్‌బాబు

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన

బాపట్ల, న్యూస్‌టుడే: విదేశాల్లో గుర్తింపు కలిగిన మంచి విశ్వవిద్యాలయాల్లో చేరి ఎంఎస్ కోర్సులు చదివి ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలని బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ టీఈ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. కళాశాలలో విదేశాల్లో ఉన్నత విద్యపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్ దేశాల్లో ఉన్నత విద్యావకాశాల వివరించారు. కళాశాల శిక్షణ, ఉపాధి కల్పనాధికారి సీహెచ్ వేణుబాబు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి


చిత్రపటానికి పూలమాల వేసిన భాజపా నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: జనసంఘ్ అధ్యక్షుడిగా, ఆర్ఎస్ఎస్ నేతగా సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కృషి చిరస్మరణీయమని భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అన్నారు. భాజపా జిల్లా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేతలు మణియాదవ్, భావనారాయణ, శ్రీనివాసరాజు, శ్రీనివాసులు, తిలక్, బాలనారాయణ, శ్రీనివాసరావు, పేరిరెడ్డి, అనిల్‌కుమార్, మధుబాబు పాల్గొన్నారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు, న్యూస్‌టుడే: లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పొన్నూరు మండలం చింతలపూడి వద్ద బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. బాపట్ల పట్టణ పరిధిలోని ఓ రైస్ మిల్లు నుంచి లారీలో 200 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిరకు తరలిస్తున్నారు. పొన్నూరు గ్రామీణ ఎస్సై కిరణ్‌బాబు తెల్లవారుజామున చింతలపూడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో రేషన్ బియ్యం లారీని తనిఖీ చేసి అందుకు సంబంధించిన పత్రాలు చూపించమని డ్రైవర్లను ఎస్సై కోరారు. ఎటువంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో అనుమానం వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం లారీని గ్రామీణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. పొన్నూరు పౌరసరఫరాల శాఖాధికారిణి భువనేశ్వరికి పోలీసులు సమాచారాన్ని చేరవేశారు. బియ్యాన్ని ఆమె పరిశీలించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఎట్టకేలకు నాయనమ్మ చెంతకు పిల్లలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గత ఏడాది నవంబరులో బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరు పిల్లలు ప్రకాశం జిల్లాలో తప్పిపోయారు. వారికి తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో ఒంగోలులోని బాలసదన్‌లో ఉంచారు. ఇటీవల బాపట్ల జిల్లా ఈపురుపాలెం, స్టూవర్టుపురం ప్రాంతాలకు తీసుకెళ్లి వారి బంధువులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. స్టూవర్టుపురంలో వారి నాయనమ్మతో పాటు, బంధువులను పిల్లలు గుర్తించారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో బుధవారం వారిని బంధువులకు అప్పగించారు. పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్లలోని బాలసదన్‌లో ఉంచి విద్యను అందించాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు.

ముత్తుపల్లి పంట కాలువ కట్టకు గండి



వేల ఎకరాలకు సాగు నీరందించే ముత్తుపల్లి పంట కాలువ కట్టకు నగరం శివారు శ్రీనివాసుని దేవాలయం సమీపంలో గండి పడింది. దీంతో గండ్లు, దొంగతూముల వల్ల దిగువకు చుక్క నీరు రావడం లేదని దిగువ రైతులు విమర్శలు చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపమవుతోంది. గత అయిదేళ్లుగా పంట కాలువ కట్టలు అభివృద్ధికి నోచుకోలేదు. లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా తీరం గ్రామాల్లో వరి చేలకు చుక్కనీరు రాక రైతులు అవస్థలు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తీరం రైతులు కోరుతున్నారు. *- నగరం, న్యూస్‌టుడే*

ఉత్సాహంగా చెకుముకి ప్రతిభ పరీక్ష


చెరుకుపల్లి: గుళ్లపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో సైన్స్‌పై విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని వక్తలు సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చెకుముకి ప్రతిభ పోటీ పరీక్షను బుధవారం నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 300 మంది పరీక్ష రాశారు. చెరుకుపల్లి, గుళ్లపల్లి, పొన్నపల్లి, కనగాలలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొన్నారని వేదిక మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు తెలిపారు. బాపట్ల ఏవీవీ ఉన్నత పాఠశాలలో పరీక్షను ఎంఈవో డి.ప్రసాద్ పరిశీలించారు. వెదుళ్లపల్లిలో ఎంఈవో నిరంజన్, హెచ్.ఎం జయకుమార్, జేవీవీ నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఫిర్యాదు

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ఉండి శాసనసభ్యుడు రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి, న్యాయవాది ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేడ్కర్ యువజన సంఘం నేతలు రంజిత్, పోతురాజు, గుణపతి, చందు, గోపి, గౌతమ్ తదితరులతో కలిసి చెరుకుపల్లి ఎస్సై అనిల్‌కుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే చించారని, ఆ చర్య దేశద్రోహం కిందకు వస్తుందని వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు ఫిర్యాదు అందిందని ఎస్సై తెలిపారు.


కర్లపాలెం: పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ


వేమూరు: పోతుమర్రులో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

సంక్షోభంలోనూ సంక్షేమ పాలన

వేమూరు, రేపల్లె అర్బన్, చెరుకుపల్లి, బాపట్ల పట్టణం, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కాబట్టే ఇది మంచి ప్రభుత్వమని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. వేమూరు మండలం పోతుమర్రులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ నుంచి బాపట్ల మీదుగా గూడూరు వరకు నాల్గోలైన్ పనులు పూర్తి చేసి, విద్యుదీకరించాలని రైల్వే ఛైర్మన్‌కు లేఖ రాశానని చెప్పారు. సికింద్రాబాద్ - రేపల్లె డెల్టా ఫాస్ట్ పాసింజర్ రైలు వేమూరు స్టేషన్‌లో నిలుపుదల చేయాలని రైల్వే అధికారులను కోరినట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులు గంజాయి, మాదక ద్రవ్యాలను యువతకు చేరువ చేసి రాష్ట్రాన్ని మత్తు ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జె.విజయబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, సర్పంచి కె.మైనా, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు వివరించారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్డీవో రవీందర్, తహసీల్దారు వెంకటరత్నం, జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. చెరుకుపల్లిలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. తెదేపా నాయకుడు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, సర్పంచి దేవరకొండ వాణి ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. రేపల్లె 26, 27 వార్డులు, రూరల్ మండలం ఉప్పూడి, గుడ్డికాయలంక, పెనుమూడి, చాత్రగడ్డ, కామరాజుగడ్డనార్తులో తెదేపా నాయకులు గంగాధర్, శ్రీనివాసరావు, వీరయ్య తదితరులు ప్రభుత్వ పాలనకు సంబంధించిన కరపత్రాలు అందించారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోపాలకృష్ణ పాల్గొన్నారు. నిజాంపట్నం సచివాలయం-1 ప్రాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య మాట్లాడారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కాముల సాంబశివరావు, సర్పంచి కె.గోవిందమ్మ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం, కోడూరులో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గ్లోరియానెట్, సర్పంచులు శివకుమారి, శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను అందజేశారు.


చెరుకుపల్లి: ప్రసంగిస్తున్న తహసీల్దార్ పద్మావతి

తిరుమల లడ్డూ కల్తీ క్షమించరాని నేరం

కర్లపాలెం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూను కల్తీ చేయడం క్షమించరాని నేరమని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గుంటుపల్లి తులసీ కుమారి అన్నారు. లడ్డూ కల్తీ చేసి తిరుమలను అపవిత్రం చేయడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కర్లపాలెం జనసేన నేతలు స్థానిక జనార్ధనస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేసి దీక్ష చేపట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు, నేతలు విజయ, సునీత, సుజాత, సావిత్రి, శ్రీనివాసులు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రాయశ్చిత్త దీక్షలో జనసేన నేతలు

అర్హులు పక్కా ఇళ్లు నిర్మించుకోవాలి

నిజాంపట్నం: మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో పక్కా ఇళ్లు మంజూరైన వారు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ జేడీ సురేష్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో అర్హులను చైతన్యపరచాల్సిన బాధ్యత నోడల్, కేటాయించిన అధికారులపై ఉందన్నారు. ఎంపీడీవో నాగలక్ష్మి, ఏఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం) : ఖాజీపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు బుధవారం దుస్తులు అందజేశారు. కళాశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలుగా ఉద్యోగం చేస్తున్న లక్ష్మీనారాయణ, మారుతి, మాలతి తమ గురువు, కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ మంతెన కృష్ణంరాజు పేరిట అందజేశారని పీడీ షేక్ కరీముల్లా తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ సాంబమూర్తిరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

పేటేరు(రేపల్లె అర్బన్), వేమూరు, కొల్లూరు, అమృతలూరు, కర్లపాలెం, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ రేపల్లె సహాయ సంచాలకుడు రాగల విజయబాబు సూచించారు. రేపల్లె మండలం పేటేరు, మోర్లవారిపాలెంలో రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తే సాగు ఖర్చు పెరగడంతోపాటు భూసారం దెబ్బతింటుందన్నారు. అమృతలూరు మండలం గోవాడ, యలవర్రు గ్రామాల్లో వరి పొలాలను సందర్శించిన ఏవో లోకేశ్వరి మాట్లాడుతూ పాముపొడ తెగులు నివారణకు ఎకరాకు 300గ్రా. ఎస్ఫేట్ మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కొల్లూరు మండలం చిలుమూరు, ఈపూరు పరిధిలో 170 మంది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే పొలాలను వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. వేమూరు మండలం బూతుమల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈవో మహేష్ వరిలో పాముపొడ, తెల్లదోమ నివారణ చర్యలు వివరించారు. కర్లపాలెం మండలం యాజలి, దుండివారిపాలెం పంచాయతీల్లో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ హుస్సేన్ మాట్లాడుతూ ఈనెల 28లోపు పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.



రేపల్లె: మాట్లాడుతున్న ఏడీఏ విజయబాబు

'అత్యున్నత వృత్తుల్లో ఫార్మసీ మూడోది'

వేటపాలెం, న్యూస్‌టుడే: ప్రపంచంలోని అత్యున్నత వృత్తుల్లో ఫార్మసీ మూడోదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఔషధాల తయారీ, పంపిణీలో ఫార్మసిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. సెయింటాన్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మసిస్టుల దినోత్సవం రోజును కళాశాల ప్రధానాచార్యుడు వీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

ఇంకొల్లు ఎంపీడీవోగా శ్రీనివాసరావు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు ఎంపీడీవోగా మల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని కొరిశపాడు ఎంపీడీవోగా నియమించారు.



ఏపీఎంగా మాణిక్యరావు బాధ్యతల స్వీకరణ

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం వెలుగు ఏపీఎంగా ఎస్. మాణిక్యరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా పొదిలి మండలంలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కొరిశపాడు మండలానికి వచ్చారు. కొరిశపాడు మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న అనూరాధ బదిలీపై ఇంకొల్లు వెళ్లారు.



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? సోపిరాల ఆర్సీ వద్ద మ్యాన్‌హోల్ వద్ద బురద ఉంది. దీని వల్ల దోమలు బెడద ఎక్కువగా ఉంది.
కె.శ్రీనివాసరావు, సొనికరు, సోపిరాల
✔ పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో మ్యాన్‌హోల్ వద్ద బ్లీచింగ్ చల్లించి దోమలను నివారించి సమస్యను పరిష్కరిస్తాం
? సోపిరాల నుంచి చినగంజాం సచివాలయం-2కు వెళ్లే సిమెంటు రోడ్డు పక్కన తుమ్మచెట్లు పెరిగాయి. వాటి కొమ్మలు రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు ఇబ్బంది గురవుతున్నారు.
✔ పరిశీలించి, పంచాయతీ సిబ్బందిని పంపి రోడ్డుపైకి వచ్చిన తుమ్మచెట్ల కొమ్మలను తొలగిస్తాం
అల్ల మస్తాన్‌రావు, గ్రామ కార్యదర్శి, చినగంజాం న్యూస్‌టుడే, చినగంజాం
? స్థానిక సంఘ థియేటర్ వద్ద కాలువలో తొలగించిన వ్యర్థాలు, చెత్త తొలగించకుండా అక్కడే ఉంచుతున్నారు. దీంతో వాసన వస్తుంది. -వెంకటరావు, స్థానికుడు
✔ వెంటనే సిబ్బందిని పంపి తొలగిస్తాం
- ప్రవీణ్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు
-న్యూస్‌టుడే చీరాల

చెత్తతో సంపద సృష్టికి అడుగులు

అక్టోబరు 2 నుంచి పునఃప్రారంభించే యోచనలో అధికారులు

చీరాల అర్బన్, అద్దంకి, పర్చూరు, న్యూస్‌టుడే

తెదేపా హయాంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను గత పాలకులు మరుగున పడేయడంతో అవి వినియోగానికి ఆమడ దూరంగా నిలిచాయి. దీంతో పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్త రహదారుల పక్కన, కాలువల వెంట కుప్పలుగా పడేయాల్సి వస్తోంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం వాటికి మెరుగులు దిద్ది అందుబాటులోకి తీసుకురానుంది.

అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి రోజున గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా వాటిలో నిలిచి పోయిన మిగిలిన పనులను పూర్తి చేస్తున్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కొన్ని చోట్ల వర్మీ కంపోస్టు కూడా తయారు చేసి విక్రయాలు ప్రారంభించారు. ఆ తరువాత వచ్చిన వైకాపా వీటి గురించి పట్టించుకోలేదు. వాడుకలోకి


వేటపాలెం చెత్త సంపద కేంద్రం

వచ్చిన కొన్నింటిని సరైన నిర్వహణ లేక మూసివేశారు.

పంచాయతీలను బలోపేతం చేసేందుకు ఏర్పాటు

చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల పరిధిలో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేరుగా నిల్వ చేయడం, దాన్ని ఎరువుగా మార్చిన తర్వాత అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనేది ఉద్దేశం. దీనికి గాను ఇద్దరు గ్రీన్ అంబాసిడర్లను నియమిస్తూ జీత

భత్యాలు సమకూర్చే వారు. వైకాపా ప్రభుత్వంలో ఈ కేంద్రాలను వీటిని పట్టించుకోలేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ప్రస్తుతం చెత్త సంపద కేంద్రాలు నిర్వహణ లేక మందుబాబులకు అడ్డాగా మారాయి. కేంద్రాల్లోని తొట్లలో మద్యం సీసాలు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలోని 103 గ్రామపంచాయతీలకు గాను 100 గ్రామపంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను నెలకొల్పారు. పర్చూరు నియోజకవర్గంలో 86 కేంద్రాలు నెలకొల్పగా అన్ని కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. చీరాల నియోజకవర్గం వేటపాలెం, చీరాలలో ఇంకా కొన్నింటిని నిర్మించాల్సి ఉంది. ఈ విషయమై ఇన్‌ఛార్జి డివిజనల్ పంచాయతీ అధికారి డి.హనుమంతరావును వివరణ కోరగా గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాల దుస్థితిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నాం. అక్టోబరు 2 గాంధీ జయంతి నుంచి కేంద్రాలకు పూర్వ వైభవం తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

ఇసుక కొరత తీర్చండి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల ప్రాంతంలో ఇసుక కొరత తీర్చి ఉపాధి లేక అవస్థలు పడుతున్న కార్మికులను ఆదుకోవాలని చీరాల తాలూకా తాపీ కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. చీరాల తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. అధ్యక్షుడు పోపూరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తెచ్చినా.. ఈ ప్రాంతంలో అమలు కావడం లేదన్నారు. నదుల వద్ద నుంచి ఇసుక తెచ్చి ఇక్కడ డంపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

అంబటిపూడి(బల్లికురవ), న్యూస్‌టుడే: నాబార్డ్ బ్యాంకులు అందించిన రుణాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అంబటిపూడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజిత్ అన్నారు. గ్రామానికి చెందిన ఓ సామాజిక రైతు ఉత్పత్తిదారుల సంఘానికి రూ.16 లక్షల రుణం మంజూరు పత్రాలను బుధవారం అందించారు. సకాలంలో కంతులు చెల్లిస్తూ అటు రైతు కుటుంబాభివృద్ధి, ఇటు బ్యాంక్ పురోభివృద్ధికి పరస్పర సహకారం అందించాలని సూచించారు.

ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ముప్పవరం (జే.పంగులూరు), చినగంజాం, పర్చూరు, యద్దనపూడి, వేటపాలెం, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చీరాల ఆర్డీవో జె.సూర్యనారాయణరెడ్డి అన్నారు. ముప్పవరంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాభీష్టం మేరకు భూహక్కు, చెత్త రద్దు, పింఛను పెంపు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నేతలు కూడా మన రాష్ట్ర ప్రభుత్వ పనితీరును మెచ్చుకోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. కార్యక్రమ ప్రత్యేకాధికారి ఎన్‌వీఎస్.రాంకుమార్, ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ నాగరాజారావు గ్రామపంచాయతీ కార్యదర్శి జానీబేగం, తెదేపా నేతలు కుక్కపల్లి ఏడుకొండలు, జగన్‌మోహనరావు, బ్రహ్మానందస్వామి తదితరులు పాల్గొన్నారు. వంద శాతం ఉపాధి నిధులు రూ.10 లక్షల నిధులతో శంకుస్థాపనలు చేసి


యద్దనపూడి: మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణకుమారి

నట్లు పంచాయతీరాజ్ మండల ఏఈ డి.రాము తెలిపారు. చినగంజాం మండలం కొత్తపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా బాపట్ల పార్లమెంటు వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మొలతాటి రామారావు పాల్గొన్నారు. పర్చూరులో, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి అజాద్ పాల్గొన్నారు. పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పూసూరులో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కృష్ణకుమారి, ఉప్పుటూరు, నాగులపాలెంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చీరాల మండలం దేశాయిపేట పంచాయతీ కార్యాలయంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వ' కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు ఎంపీడీవో ఎంవీఎస్‌శర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలు గురించి వివరించారు.

ఘనంగా దీన్ దయాళ్ జయంతి

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని పర్చూరులో భాజపా నాయకులు ఘనంగా నిర్వహించారు. భాజపా జిల్లా నాయకుడు కుక్కా శ్రీనివాసరావు, పర్చూరు పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ శాస్త్రి అన్నారు. బుధవారం మండలంలోని చెరుకూరులో దీన్ దయాళ్ జయంతి నిర్వహించారు. దేశ ప్రజల ఉన్నతికి దయాళ్ కృషి చేశారన్నారు. దేశంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషిని కొనియాడారు.


చీరాల: చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

చీరాల, న్యూస్‌టుడే : భాజపా సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ చూపిన మార్గంలోనే నేటికి నడుస్తూ ప్రజాసేవ చేస్తున్నామని భాజపా నాయకులు పేర్కొన్నారు. పండింట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అండగా ఉండాలి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కాపులు అండగా ఉండాలని రాష్ట్ర కాపు సేవ సమితి అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు అన్నారు. బుధవారం చీరాల వచ్చిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా బత్తుల శివనాగేశ్వరరావు, రాష్ట్ర న్యాయసలహా విభాగం కార్యదర్శిగా కనుమర్లపూడి రామారావు ఎంపికవగా వారికి నియామక పత్రాలు అందజేశారు.


మాట్లాడుతున్న శివనాగేశ్వరరావు

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

అద్దంకి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జనసేన నేత వెంకట్రావు అన్నారు. అద్దంకి జనసేన పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ అధినేత పిలుపు మేరకు గ్రామాల్లో ఈనెల 30న దీపారాధన, అక్టోబరు ఒకటిన ఓం నమశివాయ పారాయణం, రెండున నగర సంకీర్తన, మూడో తేదీ భజన చేయాలని సూచించారు. జనసేన నేతలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

అద్దంకి, న్యూస్‌టుడే: పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. వేలమూరిపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద బుధవారం పోషణ్ మహ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఇందిర, ఐసీడీఎస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలినేని ఫ్లెక్సీ చించిన గుర్తుతెలియని వ్యక్తులు

మేదరమెట్ల: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరుతున్న సందర్భంగా మేదరమెట్లలోని జాతీయ రహదారి పక్కన రెండు రోజుల క్రితం జనసేన జెండాతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దానిని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఈ ఘటనపై జనసేన నాయకులు మేదరమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బందికి తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థుల స్వచ్ఛతా హీ సేవ

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని వలపర్లలో బుధవారం ఎన్‌సీసీ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు.

వాహన సోదాలు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరు ఓడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారిపై స్థానిక వై-జంక్షన్ వద్ద పర్చూరు పోలీసులు విస్తృతస్థాయిలో వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మాల్యాద్రి తమ సిబ్బందితో హైవేపై ప్రయాణించే కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేసి రవాణాశాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహన తనిఖీ అధికారి అంకమ్మరావు పర్చూరులో బుధవారం భారీ వాహనాలను తనిఖీ చేశారు. వాహన సామర్థ్యం, పన్ను చెల్లించని ఒక లారీని సీజ్ చేసినట్లు అంకమ్మరావు వెల్లడించారు.

విద్యార్థులు 850.. మధ్యాహ్న భోజనం తీనేవారు 150

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి రూ.కోట్లు వ్యయం చేస్తోంది. ఈ పథకానికి వినియోగించే బియ్యం కూడా నాణ్యత కలిగినవే అందిస్తోంది. అయినా చాల మంది విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదు. పట్టణ నడిబొడ్డులో కస్తూరిబా గాంధీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఉంది. ఇక్కడ 850 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. బుధవారం 668 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరుకాగా వీరిలో 150 మంది మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకోవడం గమనార్హం. దీనిపై ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌ను


విద్యార్థులకు వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

'న్యూస్‌టుడే' వివరణ కోరగా పట్టణ ప్రాంతం కావడంతో ఎక్కువ మంది ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల తల్లితండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భోజన పథకాన్ని వినియోగించుకునేలా పిల్లలను ప్రోత్సహించాలని వారికి సూచించినట్లు పేర్కొన్నారు.

నేత్రదానం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్‌ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 563వ నేత్రదానం జరిగింది. ఇంకొల్లుకు చెందిన కందిమళ్ల సరోజిని (82) బుధవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు ఎస్. రామమోహనరావు, జెట్టి స్వామి పెదకాని శకర కంటి ఆస్పత్రి సిబ్బందిని రప్పించి దాత కార్నియాలను సేకరించారు. మృతుని కుటుంబ సభ్యులకు రోటరీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.


సరోజిని (పాతచిత్రం)

పొంగిన వాగు.. నిలిచిన రాకపోకలు

యద్దనపూడి, న్యూస్‌టుడే: మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఎగువ నుంచి ప్రవహిస్తున్న నీరు తోడవడంతో వివిధ గ్రామాల మధ్య వంతెనలపై వరదనీరు ప్రమాదకరస్థాయిలో ప్రవహించి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. యద్దనపూడి మండలంలోని పలు గ్రామాలకు పర్చూరు వాగు వరద ఉద్ధృతితో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా పోలూరు సమీపంలోని పర్చూరు వాగు ఉప్పొంగడంతో శ్యామలవారిపలెం, పోలూరు నుంచి యద్దనపూడికి రాకపోకలు నిలిచాయి. వంతెనపైకి భారీగా వరద నీరు చేరడంతో సమాచారం అందుకున్న పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. వింజనంపాడు, చిలూకూరివారిపాలెం గ్రామాల మధ్యనున్న వాగు లోలెవల్ వంతెనపై వరదనీరు పెద్ద ఎత్తున చేరి ప్రవహించడంతో మండల కేంద్రం యద్దనపూడికి రాకపోకలు నిలిచాయి.


పోలూరులో వంతెన వద్ద పోలీసుల పోలీసుల పహారా

చెకుముకి ప్రతిభా పరీక్షలు

అవీ ఇవీ

పందిళ్లపల్లి(వేటపాలెం): స్థానిక జడ్పీ పాఠశాలలో బుధవారం చెకుముకి సైన్సు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. పరీక్షల్లో పృథ్వీ ధనుస్సు, గుంటూరు హర్ష, బట్ట లలిత సాయి, గద్దె పావని ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయడు తెలిపారు.

ఇంకొల్లు, చినగంజాం, న్యూస్‌టుడే: ఇంకొల్లు, జడ్పీ, బాలికోన్నత పాఠశాలలు, పూసపాడు ఏకేపీవీఎస్, ఇడుపులపాడు విద్యాపరిషత్, పావులూరు జడ్పీ, దుద్దుకూరు ఆచార్య రంగా జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షలకు 300మంది విద్యార్థులు హాజరయ్యారు. చినగంజాం, పెదగంజాం, కడవకుదురు తదితర జడ్పీ పాఠశాలల్లో పాఠశాల స్థాయి చెకిముకి ప్రతిభా పోటీ పరీక్షలను నిర్వహించినట్లు ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు.

పేదలకు అన్నదానం

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు పట్టణ పరిధిలోని అమ్మ, వెంకయ్య ఆశ్రమాల్లో బుధవారం పేదలు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో దాతలు రావుల బాపయ్య, కందిమళ్ల నిర్మల అన్నదానం చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

అద్దంకి, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థికి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ. సాగర్ అన్నారు. అద్దంకి పట్టణంలోని సాధన జూనియర్ కళాశాల ఆవరణలో మద్యపానం, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కరపత్రాలు ప్రదర్శిస్తూ పట్టణంలో ప్రదర్శన చేశారు.

ఇసుక అక్రమ తరలింపు అడ్డగింత

చీరాల గ్రామీణం: చీరాల మండలం చీరాల నగర్ పంచాయతీ పరిధిలో అక్రమ ఇసుక రవాణాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తహసీల్దార్ గోపీ కృష్ణ బుధవారం చీరాల నగర్ పరిధిలోని రెండు ప్రభుత్వ లేఔట్‌లను పరిశీలించడానికి అక్కడకు రాగా ఈ విషయం వెలుగు చూసింది. వెంటనే ఆయన రెవెన్యూ సిబ్బందిని పిలిపించి ఇసుక తరలిస్తున్న ఏడు బండ్లు స్వాధీనం చేసుకున్నారు.

కారు బోల్తా.. ప్రయాణికులు సురక్షితం

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి): నామ్ రహదారిపై శింగరకొండ రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో జరిగిన ప్రమాదంలో కారు బోల్తా పడింది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన ఇద్దరు హైదరాబాద్ నుంచి వస్తుండగా అద్దంకి పట్టణ శివారులో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తీసి రవాణా పునరుద్ధరించారు.

హైవే విస్తరణ పనులతో పంటలకు ముప్పు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: ఓడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వరదనీరు ప్రవహించే మార్గాలు లేక అన్నదాతలు పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి జల్లులకు పొలాల్లో నీరు నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. మంబలంలోని అన్నంబొట్లవారిపాలెం నుంచి రామానాయుడు వారధి వరకు హైవే విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రోడ్డు వెంటున్న పురాతన కాలువలు పూడ్చివేసి కొత్తగా రోడ్డును గ్రావెల్, మెటల్‌తో అభివృద్ధి పరిచారు. దీంతో వరదనీరు కిందికి ప్రవహించే మార్గాలు, కాలువలు కనుమరగవడంతో రైతుల పొల్లోనే కనుచూపుమేర వరదనీరు చేరుకుని వారిని ఆందోళనకు గురిచేస్తోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వాన జల్లులకు తిమ్మరాజుపాలెం, ఉప్పుటూరు, రామానాయుడు వారధి ప్రాంతాల్లోని రైతుల పొలాలు జలసంద్రంగా మారాయి. కనిపిస్తున్నాయి.


రైతుల భూముల్లో నిలిచిన వాననీరు

సజ్జాపురం మాజీ సర్పంచి మృతి

సజ్జాపురం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: సజ్జాపురం మాజీ సర్పంచి తేలప్రోలు కనకమ్మ (81) మంగళవారం మృతి చెందారు. ఆమెకు శ్వాస ఆడకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. ఆమె 2001-2006, 2013-2018 రెండు పర్యాయయాలు సర్పంచిగా బాధ్యతలు నిర్వహించారు. ఆమె మృతిపై విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


కనకమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి, అద్దంకి, జే.పంగులూరు, బల్లికురవ, మేదరమెట్ల, న్యూస్‌టుడే : రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులు అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నాగభైరు మోహనరావు కోరారు. పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి మండలాల్లోని నూతలపాడు, పోతుకట్ల, తనుబొద్దివారిపాలెం, బొబ్బేపల్లి, రాజుగారిపాలెం, స్వర్ణ, కొడవలివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారుల సమక్షంలో సాగు చేసిన పంటలోపాలు రైతులకు తెలియజేయడమే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.ధన్‌రాజ్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అద్దంకి, బల్లికురవ, జే. పంగులూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలను అధికారుల బృందం పరిశీలించారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు ఆధునికతను జోడించాలని ఏడీఏ ధనరాజ్ అన్నారు. కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు.


పసుపు పంట పరిశీలిస్తున్న అధికారులు

క్రైమ్ కార్నర్

ఆ మృతదేహం విజయలక్ష్మిదేనా ?

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: అదృశ్యమైన వృద్ధురాలు హత్యకు గురైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని విజిలిపేటకు చెందిన విజయలక్ష్మి(79) 15వ తేది నుంచి కనపడటం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో 19న ఒకటో పట్టణ పోలీసుకు ఫిర్యాదు చేశారు. అయితే ప్రకాశం జిల్లా దొనకొండ మండలం గంగదేవిపల్లి సమీపంలో మూడొంతులు కాలిపోయిన మహిళ మృతదేహం బుధవారం వెలుగు చూడడంతో అక్కడ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆ వివరాలు అన్ని స్టేషన్లకు పంపారు. దీంతో వారు చెప్పిన ఆనవాళ్లు ఇక్కడ కనపడకుండా పోయిన విజయలక్ష్మి వివరాలు కుటుంబ సభ్యుల నుంచి పోలీసులు తెలుసుకున్నారు. దీంతో ఆ మృతదేహం వృద్ధురాలిదిగా పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ కేసును హత్యకేసు కింద మార్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుమారుడిపై తండ్రి దాడి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో కుమారుడిపై తండ్రి, మరో వ్యక్తి దాడి చేసి గాయపర్చిన ఘటన చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ పరిధి అంబేద్కర్ నగర్‌లో చోటు చేసుకుంది. ఈపూరుపాలెం పోలీసుల వివరాల మేరకు.. ఏసోబు, కరుణసాగర్ తండ్రీకొడుకులు. వీరి మధ్య కొంత కాలంగా కుటుంబ గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కుమారుడిపై తండ్రి మరొక వ్యక్తి పీటర్ పాల్ సాయంతో దాడి చేసి గాయపర్చారు. క్షతగాత్రుడిని చికిత్స నిమత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వస్తువులు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుపై కేసు నమోదు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: తన ఇంటిని ఆక్రమించడమే కాకుండా అందులోని వస్తువులను విక్రయిస్తున్నారని పట్టణంలోని హరిప్రసాద్‌నగర్‌కు చెందిన వల్లెపు బాల అంకమ్మరావు ఇటీవల ఒకటో పట్టణ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పోలీసులు స్పందించలేదు. దీంతో బాధితుడు జిల్లా ఎస్పీని కలిసి సమస్య విన్నవించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గవిని వేణు, న్యాయవాది అమృతరావు, మువ్వా బాలశంకరరావుతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం!

బల్లికురవ, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు మందలించారని ఇద్దరు విద్యార్థులు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు(17) (20) చదువు విషయమై తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురై వారు ఇంట్లోని పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు వారిలో ఒకరిని అద్దంకి, మరొకరిని చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి మండలంలోని కుంకుబాడు సమీపంలోని చిలకలేరులో ఇసుక అక్రమ తవ్వకాలపై పోలీసులు బుధవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇసుక తవ్వకాల వద్ద నాలుగు ట్రాక్టర్లు లు ఉండగా ముగ్గురు పరారీ కాగా ఒక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జూదరుల అరెస్టు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని చెన్నుంబొట్ల అగ్రహారంలో జూదం ఆడుతున్న అయిదుగురిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మల్యాద్రి తెలిపారు. వారి నుంచి రూ. 10,050 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.